క్లుప్తంగా

నామా గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చుంచుపల్లి: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శనివారం బాబు క్యాంప్‌లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ ఓటర్లను కలిశారు. నిస్వార్థ ప్రజా నాయకుడు నామాకు మద్దతుగా నిలబడాలని అభ్యర్థించారు. కూసన వీరభద్రం, ఎల్లండి సదామోహన్, నవీన్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో న్యూకాలనీకి చెందిన పలువురు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

కారు గుర్తుకు ఓటేసి కవితను గెలిపిద్దాం..



ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నమూనా బ్యాలెట్‌తో కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి ఓటు వేయాలని కోరారు.

లింగయ్యదొరను గెలిపించుకుందాం..



ప్రచారం చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి చందా లింగయ్య విజయాన్ని కాంక్షిస్తూ ఆదివాసీ సంఘాల జేఏసీ శనివారం పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించింది. ఇంటింటికీ వెళ్లి చందా లింగయ్యదొరను గెలిపించాలని కోరారు. తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తి రాజు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలంతా తమ సత్తా చాటాలని కోరారు.

'కార్పొరేట్'కే కొమ్ము కాస్తున్న జాతీయ పార్టీలు



మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి కామేష్

పాల్వంచరూరల్: జాతీయ పార్టీలు పెట్టుబడిదారులు, కార్పొరేట్ వ్యక్తులకే కొమ్ము కాస్తున్నాయని బహుజనవాదం గెలవకపోతే ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకమే అని బీఎస్పీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. దంతలబోరు, నారాయణరావుపేట, సంగం, నాగారం గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. పేదలు, బీసీలు, దళిత, గిరిజన, మైనార్టీలను ఓటు వేసే యంత్రాలుగానే ప్రధాన రాజకీయ పార్టీలు చూస్తున్నాయన్నారు. ఏనుగు గుర్తుపై ఓటు వేసి ప్రజాసమస్యలపై పోరాడే తనను గెలిపించాలని కోరారు. సాయి, నాగేశ్వరరావు, తాటిపాముల హరికృష్ణ, మురళి పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి..

ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులు.. వారు చెప్పిందే వేదం.. వారు చేసిందే శాసనం.. ఇటువంటి మాటలు ఎన్నికల సమయంలోనే ఎక్కువగా వింటాం.. ఎన్నికలు ముగియగానే వీటి నిర్వచనం మారిపోతుంది. అవినీతి రహిత సమాజం నిర్మిద్దామని ప్రతిజ్ఞ పూనేది జనమే. ఎన్నికలు రాగానే ఐదు వందలు.. వెయ్యి తీసుకొని ఓట్లు వేసేది మనమే. ఇలా డబ్బులకు ఆశపడి ఒక్కసారి ఓటు అమ్మితే అది కొనుక్కుని పదవిలోకి వచ్చిన నాయకులు ఐదేళ్లు అప్పనంగా మేస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితి.

- 'నోటు'ఖర్చయిపోతుంది.. 'ఓటు'మురిగిపోతుంది.
- ఇప్పుడు కొంటారు.. తరువాత తప్పించుకుంటారు
- పని చేసేవాళ్లకే పట్టం కట్టాలి
- రేపు లోక్‌సభ ఎన్నికలు



ఇల్లెందురూరల్: ఐదేళ్ల కోసం అందరి తరపున కొందరిని ఎన్నికల్లో గెలిపించి ప్రజాప్రతినిధులుగా పంపిస్తుంటాం. ఢిల్లీకి మన తరపున పంపించే సమయం ఆసన్నమైంది. ఇలా వెళ్లిన వారు ప్రజల తరపున, ప్రజల కోసం పనిచేయాలి. మంచి పాలన అందించాలంటే ప్రతినిధులు మంచివారై ఉండాలి. తమ ప్రాంత ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించాలి. వారికి కష్టమొస్తే తనకే వచ్చిందనన ట్లుగా అనుకునే మనస్తత్వం ఉండాలి. ఫలానా చోట పనికావట్లేదు.. కావాలనే ఇబ్బందికి గురిచేస్తున్నారంటూ ఓ సామాన్యుడు చెప్పినా.. పెడచెవిన పెట్టకుండా పద నీతోవస్తా.. పనెందుకు కాదో అనే వ్యక్తి మన నాయకుడు కావాలి. మీకు నేనున్నానన్న భరోసా కలిగించేలా పనిచేయాలి. ఇలాంటి ప్రతినిధి మనకు దొరకాలంటే మనమూ న్యాయంగా ఓటు వేయాలి. నాయకులిచ్చే పచ్చనోట్లకు ఆశపడి గుడ్డిగా ఓటు వేస్తే అవస్థలు తప్పవు.

ఎందుకా డబ్బులు.. ఉంటాయా..

ఎన్నికలనగానే డబ్బున్నోళ్లు రంగంలోకి దిగుతున్నారు. పనిచేసే వాళ్లను వెనక్కినెట్టేస్తున్నారు. భిక్ష కుడికి రూపాయి ఇవ్వని వారెందరో నాయకులుగా మారి జనాల్లోకి ఓట్ల కోసం రావడం అలవాటైంది. అవసరమైతే ఓటుకు రూ.500 ఇస్తుంటారు. అయితే వారిచ్చే డబ్బులకు ఓటు వేస్తే మాత్రం ఐదేళ్లపాటు అవస్థలు తప్పవు. పనిచేయాలని నేతలను ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోతాం. ఎన్నికల సమయంలో వారిచ్చిన డబ్బు ఆ సమయంలో అడ్డుగోడగా నిలుస్తుంది. ఓట్ల కోసం నాయకులు ఇచ్చే డబ్బులు మహా అంటే ఒకటి, రెండు రోజులంటాయి. కానీ ఐదేళ్ల వారు చేసింది చూడటం తప్ప మనకేం కావాలో అడిగే హక్కును కోల్పోతాం. అందుకే ఎన్నికల్లో 'నోటుకు ఓటు'వేయవద్దని స్వచ్ఛంద సంస్థలు, యువకులు ఇప్పుడు జోరుగా ప్రచారం చేస్తున్నారు. అధికారులు సైతం గ్రామాల్లో పలు రూపాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

మద్యం మత్తు వీడుదాం..

ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమెలా అనే ఆలోచనల్లోనే నాయకులు ఉంటారు. ఓటును బ్రహ్మాస్త్రంగా వినియోగించుకోవాల్సిన కొందరు దాన్ని మద్యానికి అమ్ముకుంటే ఇంకొందరు బహుమతులతో ప్రలోభాలకు గురవుతున్నారు. ఎన్నికల వేళ మాత్రమే ఓటరు జపం చేసే నాయకుల దగ్గర ఇటువంటి తాయిలాలు తీసుకొని ఒక్కరోజు మత్తులో తూగితే ఐదేళ్లపాటు అంధకారంలో గడపాల్సి వస్తుందన్న విషయం మరువకూడదు. మన కోసం పనిచేసే నేతను ఎన్నుకుందాం. దీనికోసం ఎన్నికల రోజు మత్తు వీడుదాం.

నిర్లక్ష్యం వద్దు..

నోటుకు ఓటు అమ్ముకునే వారు కొందరైతే.. తమకే మొస్తుందని అసలు ఓటు హక్కునే వినియోగించుకోని వారు మరికొందరు. విద్యావంతులు సైతం ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మన తలరాతను నిర్దేశించే వారిని ఎన్నుకునే ఈ సమరంలో మన అభ్యున్నతికి పాటుపడే నాయకులను గెలిపించుకునే అవకాశాన్ని వదులుకోకుండా ఓటు అనే వజ్రాయుధాన్ని వినియోగించాల్సిన అవసరముంది. యువత నడుం బిగించి ఓటర్లను చైతన్యవంతం చేసి వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలి. అవినీతి రహిత నవశకానికి పునాది వేయాలి.

దేశానికి సేవ చేసినట్లే..



నిన్ను నీవు ఉద్ధరించుకోవాలంటే ముందు నీ హక్కులు ఏమిటో గుర్తెరగాలి. ఓటు వేయడం అనవసరం అని చాలా మంది అనుకుంటారు. ఆ ఆలోచన తప్పు. ఓటు వేస్తే దేశానికి సేవ చేసినట్టే. ఓటు ద్వారానే మంచి ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకోనే అవకాశం వస్తుంది. తద్వారా మెరుగైన సేవలను మంచి ప్రభుత్వం ద్వారా పొందే అవకాశం ఉంటుంది.

– ఆళ్ల శృతి, సుభాష్‌నగర్

ఓటే వజ్రాయుధం..



ప్రతిభ కలిగిన నాయకులతో ప్రగతికి వెలుగుబాట వేయగలిగేది ఓటు మాత్రమే. ఎన్నికల్లో డబ్బుకు దాసోహం కావొద్దు. నీతి నిజాయితీగా, నిస్వార్థంగా ఓటేస్తేనే ప్రజాస్వామ్యానికి విలువ ఇచ్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో నిలబడే నేత మంచి చెడుల్ని తెలుసుకోవాలి. అప్పుడే మంచి నాయకున్ని ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.

– ముక్తి దీపిక, మామిడిగుండాల

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



ఓటు అమూల్యమైంది. దీంతో మంచి నాయకులను ఎన్నుకోవాలి. నాయకుడు పరిపూర్ణుడుగా ఉంటేనే సమాజం సస్యశ్యామలం అవుతుంది. రూ.500 నోటు కోసం మన ఓటును అమ్ముకుంటే గెలిచిన తరువాత ఆ నాయకుడు మనల్ని అమ్మేసి స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటాడు. అందుకే మంచివారినే గెలిపించాలి.

– బొమ్మ మాధవి, 21పిట్ ఏరియా

అందరి సహకారంతో ప్రశాంతత



మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ సూచించారు. జూలూరుపాడు మండలం గుండెపుడిలో శనివారం పోలీస్, అటవీసిబ్బందికి శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఓటర్లకు ఇబ్బంది కల్గకుండా చూడాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా సంచరించకుండా అవగాహన కల్పించాలని, నాయకులు ప్రచారం చేయకుండా కట్టడి చేస్తూనే ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ జీవన్ రాజు, ఏఎస్సై తిరుపతిరావు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మహబూబాబాద్ నియోజకవర్గ సిబ్బంది సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఇల్లెందు సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం సామగ్రి పంపిణీ చేయనుండగా ఏర్పాట్లను సహాయ ఎన్నికల అధికారి కాశయ్య, తహసీల్దార్ రవికుమార్ శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలో 241 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా 2,25,097 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా బందోబస్తు విధులు నిర్వర్తించేందుకు వచ్చిన పోలీసు సిబ్బంది డీఎస్పీ చంద్రభాను సమావేశమై సూచనలు చేశారు. 300 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుందని, ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్‌లు పర్యవేక్షిస్తారని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ కరుణాకర్, ఎస్ఐ సందీప్‌కుమార్ ఉన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి..



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): రేపు జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు దేశాభివృద్ధిని నిర్ధారించే ఎన్నికలని, దేశ ఖ్యాతిని పెంపొందించాలంటే ఇండియ కూటమి, సీపీఐ, సీపీఎం, టీజేఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని, రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లోకెల్లా ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం తథ్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మిత్రపక్షాలు బలపరుస్తున్న రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం కొత్తగూడెంలోని తాటిపెల్లి హోటల్‌లో మిత్రపక్ష నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి రాష్ట్రంలో ఒక్కసీటు కూడా రాదన్నారు. ఇదే స్థితిలో బీఆర్ఎస్ పార్టీ కూడా ఉందని చెప్పారు. ప్రజలు గత పదేళ్లుగా ఈ రెండు పార్టీల విధానాలను చూస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఎన్నికల్లో ఏదోఒక సెంటిమెంట్‌ను లేవదీస్తూ ఎన్నికల్లో రాణించారని ఈసారి ప్రజలు మోదీచ కేసీఆర్ మాటలు వినే సరిస్థితిలో ఎవరూ లేరని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఒకరేమో ముస్లింల రిజర్వేషన్లు మారుస్తామంటారు, మరోకరేమో రాజ్యాంగాన్ని మారుస్తామంటారు వీరిని ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. సమావేశంలో ఎస్‌కే సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, నాగసీతారాములు, కోనేరు చిన్ని, నాగేంద్ర త్రివేది, చంద్రగిరి శ్రీనివాస్, కోదుమూరి శ్రీనివాస్, కూనంనేని భరత్, రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ

పాల్వంచరూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతవరణంలో, పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పాల్వంచ మండలం, పట్టణ పరిధిలో 90 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో రేగులగూడెం, మల్లారం, ఉలవ్వనూరు, మందేరకలపాడు, సత్యనారాయణపురం, కారెగట్టు పోలింగ్ కేంద్రాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూం ద్వారా అధికారులు పర్యవేక్షించనున్నారు. కాగా, అన్ని కేంద్రాల్లో కలిపి 89,826 మంది ఓటర్లు ఉన్నారు.

ఈ మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ఉంటుందని, ఓటర్లు సకాలంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం..



జూలూరుపాడులో బైక్ ర్యాలీ..

జూలూరుపాడు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ బీజేపీ, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజలంతా మరోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. వినోద్‌రావు గెలిస్తే ఖమ్మం పార్లమెంట్ పరిధి అభివృద్ధి చెందుతుందన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రాజేష్, భూక్యా రమేష్, భూక్యా రవి, దిబ్బెందుల సాయి, పూరేటి వెంకటేశ్వర్లు, సురేంద్రబాబు, రామకృష్ణ, రాంబాబు, గోపాల్‌రావు, పుల్లారావు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్' రోడ్‌షో



రోడ్ షోలో పాల్గొన్న నాయకులు

టేకులపల్లి: బీఆర్ఎస్ మానుకోట ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల కమిటీ, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. మండల కేంద్రంలో ఊరేగింపు చేస్తూ అందరికీ అభివాదం చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, బొమ్మెర వరప్రసాద్, ఎల్.సురేందర్, చీమల సత్యనారాయణ, బాలు, ఆమెడ రేణుక, బి.శివ పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై తీరు మార్చుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: ముస్లింలపై బీజేపీ కక్షపూరిత ధోరణిని విడనాడాలని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలని బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని పేర్కొన్నారు. అన్నదమ్ముల్లా జీవిస్తున్న హిందూ, ముస్లింల నడుమ విద్వేషాలు రెచ్చగొట్టి ఉనికిని చాటుకోవాలని బీజేపీ నాయకత్వం చూస్తోందని ఆరోపించారు. ఇక 2007లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముస్లింల్లో ఆర్థికంగా వెనుకబడిన 14 ఉపకులాలకు రిజర్వేషన్ కల్పించగా.. ఆ పార్టీపై నిందలు వేయటం సరికాదని యాకూబ్‌పాషా పేర్కొన్నారు.

చివరిరోజు ప్రచార హోరు



ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యాన ప్రచారం చేయగా పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి కొత్తూరు గ్రామపంచాయతీ పెద్దహరిజనవాడలో బీఆర్ఎస్ నాయకుడు నల్లపాటి రామారావు సహా పలువురు వెంకటరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ లావుడ్యా సోనీ, దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, బానోత్ స్వాతి, మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి



తిలక్‌నగర్‌లో ఉపాధి పని ప్రదేశంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ పాలనలోనే దేశం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు, పూనెం మధు, కాయం రమేష్, పూసపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు పులి సైదులు ఆధ్వర్యంలో బలరాం నాయక్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. దేశంలో ఉపాధి హామీ పథకం, ఆరోగ్యశ్రీ, సమాచార హక్కు చట్టం, పోడు భూములకు పట్టాలు వంటి అనేక పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రకటించిన గ్యారంటీలలో అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి దేశంలో మరింత మెరుగైన పాలన అందించేందుకు సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఇల్లెందు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

ఇల్లెందు: ఇల్లెందు (111) నియోజకవర్గంలో 242 పోలింగ్ కేంద్రాలు ఉండగా 174 ప్రదేశాలలో 242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,09,888 పురుషులు, 1,15,205 మహిళా ఓటర్లు ఉన్నారు. నాలుగు ఓట్లు థర్డ్ జెండర్, ఆరుగురు ఎన్ఆర్ఐలు, 274 మంది సర్వీస్ ఓటర్లు, 3,327 మంది గుర్తించిన వికలాంగ ఓటర్లు, 18–19 ఏళ్ల మధ్య 6,186 మంది, 85 ఏళ్ల పైబడిన వారు 1,929 మంది ఓటర్లు ఉన్నట్లు ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల అధికారి కాశయ్య తెలిపారు.

ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం..







ఇల్లెందులో చివరిరోజు ముమ్మరంగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఇల్లెందు: పది రోజులగా సాగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈసారి మందకొడిగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ మాత్రమే సభలు, సమావేశాలు, రోడ్‌షోలు ఇంటింటి ప్రచారం నిర్వహించింది. బీఆర్ఎస్, బీజేపీ రోడ్ షోలు, సభలు, సమావేశాలతో ముగించారు. అభ్యర్థులు పట్టణాలను దాటి పల్లెల్లో అడుగు కూడా పెట్టనేలేదు. దీనికి తోడు సమన్వయం కుదరక, సామగ్రి అందక పల్లెల్లో ప్రచారం చేయలేకపోయారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, చైర్మన్ డీవీ, పట్టణ, మండల అధ్యక్షుడు డానియేల్, సైదులు ప్రచార సభలలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పట్టణంలో మొక్కుబడిగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ కనీసం ఎన్నికల కార్యాలయం కూడా ప్రారంభించుకోలేకపోయింది. బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ రెండు, మూడుసార్లు ఇల్లెందుకు వచ్చినా రోడ్ షో, ప్రెస్‌మీట్, సభలకే పరిమితం అయ్యారు. కాంగ్రెస్‌కు మిత్ర పక్షాలుగా సీపీఐ, సీపీఎం, టీడీపీ, జనసమితిలు అంటీ ముట్టనట్లు ప్రచారం చేశాయి. సమన్వం పూర్తిగా కొరవడింది. కాంగ్రెస్‌లో పార్టీలో రోజురోజుకు చేరే వారి సంఖ్య పెరిగింది కానీ, కొత్త వారిని కలుపుకుని వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. ఏదీఏమైనా ముగింపుదశలో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి.

ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందాం..



సింగరేణి(కొత్తగూడెం): ఏరియా వర్క్‌షాపులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్లైన్, ఏరియా వర్క్‌షాప్, ఆర్‌సీహెచ్‌పీ, జీఎం ఆఫీస్, ఇతర డిపార్ట్‌మెంట్‌ల లో శనివారం మిత్రపక్షాలు బలపరుస్తున్న ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జెడ్పీ మాజీ చైర్మన్ గడిపెల్లి కవిత, ఐఎన్‌టీయూసీ నాయకులు ఊకంటి గోపాలరావులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కొత్తగూడెంఅర్బన్: రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం రామవరం ఏరియాలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంచి, కాంగ్రెస్ నాయకులు ఇస్త్రీ చేసి ఓటును అభ్యర్థించారు. బత్తిని రాజశేఖర్, రామవరం ఏరియా నాయకులు పాల్గొన్నారు.

పాల్వంచ: మిత్రపక్షాలు బలపర్చిన ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

రఘురాంరెడ్డిని గెలిపించాలి..

సామాన్యుల సంక్షేమం, అభివృద్ధి, దేశ సమైక్యతను కాపాడే ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చీమ శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ ఎండీ మంజూర్ అన్నారు. శనివారం స్థానిక అమర వీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పాల్వంచరూరల్: ఖమ్మం ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం యానంబైల్ గ్రామంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ముత్తేవి గిరీష్ బుడగం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం..

సుజాతనగర్: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ నాగా సీతారాములు అన్నారు. శనివారం సుజాతనగర్ మండలం సర్వారంలో కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా మాట్లాడారు.